సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం । 21 । మార్చి । 2023



ప్రభుత్వ ఖజానాకు టోకరా..
నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ సీపీ రంగనాథ్ తెలిపారు. - 8లో▸



టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేష అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/22^0$
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. పొడి వాతావరణం ఉంటుంది. రాత్రిపూట చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘టాస్’ అసోసియేట్ ఫెల్లోగా నాగయ్య



కేయూ క్యాంపస్: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అసోసియేట్ ఫెల్లోగా కాకతీయ యూనివర్సిటీ మ్యాథమెటిక్స్ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నాగయ్య ఎంపికయ్యారు. నాగయ్య ఆ విభాగంలో 13 సంవత్సరాలుగా కాంట్రాక్టు అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 20 సంవత్సరాలపాటు బోధనానుభవం ఉంది. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 30వరకు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఒక మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు పూర్తి చేశారు. గతంలో ఏపీ, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్స్‌కు ప్రధాన కార్యదర్శిగా, పాలకమండలి సభ్యుడిగా సేవలు అందించారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ ప్రతి ఏడాది ఫెల్లో, అసోసియేట్ ఫెల్లో, యంగ్‌సైంటిస్టు అవార్డులను ప్రదానం చేస్తుంది. 2021 సంవత్సరానికిగాను అసోసియేట్ ఫెల్లోగా నాగయ్యను ఎంపిక చేశారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించబోయే ఇండక్షన్ కార్యక్రమంలో ఈ అవార్డుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను తీసుకోనున్నారు. సోమవారం కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు అసోసియేట్ ఫెల్లోగా ఎంపికైన నాగయ్యను అభినందించారు.

ఫణికాంత్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు



కేయూ క్యాంపస్: తెలంగాణ అకాడమీ సైన్సెస్ (టాస్) కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగంలో పోస్టు డాక్టర్ ఫెల్లోగా పరిశోధనలు చేస్తున్న డాక్టర్ జె.ఫణికాంత్‌ను యంగ్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక చేసింది. బయోటెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీ రావు పర్యవేక్షణలో పోస్టు డాక్టర్ ఫెల్లోగా(పీడీఎఫ్) చేస్తున్నారు. కాగా.. యంగ్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఫణికాంత్‌ను అభినందించారు. త్వరలోనే హైదరాబాద్‌లో తెలంగాణ అకాడమీ సైన్సెస్ వారు అవార్డును ప్రదానం చేయనున్నారు.

ఫస్టియర్ పరీక్షల్లో 622 మంది గైర్హాజరు

కేయూ క్యాంపస్: హనుమకొండ జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో 49 కేంద్రాల్లో 622 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 19,776 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 19,154 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, 622 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు.

వరంగల్ జిల్లాలో 471 మంది...
కాశీబుగ్గ సెంటర్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 27 కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పరీక్షకు 471 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 7,388 మంది హాజరు కావాల్సి ఉండగా.. 6,917 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 471 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

యూడైస్ డాటా కీలకం

డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై



విద్యారణ్యపురి: విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, స్కాలర్‌షిప్‌లు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించే విషయంలో యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యూడైస్) డాటా క్రియాశీలకమని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని షైన్ హైస్కూల్‌లో యూడైస్ 2022-23కు సంబంధించిన డాటా ఎంట్రీపై విద్యాశాఖ సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. 10 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, డేటాను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేశాక లాగిన్‌లో ధ్రువీకరించాలని సూచించారు. గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని డీఈఓ కోరారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ఏఎస్ఓ టి.విజయ్‌కుమార్, డి.రాజు, 14 మండలాల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారుల సిండికేట్!



ఎమ్మార్పీని విస్మరించి విక్రయాలు
- కాజీపేట, వరంగల్‌లో విచ్చలవిడి
- నిబంధనలు పట్టని వ్యాపారులు..
- ‘మామూలు’గా ఆబ్కారీ శాఖ

జిల్లాల వారీగా మద్యం దుకాణాల వివరాలు..

జిల్లా	వైన్‌షాపులు
హనుమకొండ	65
వరంగల్	63
జేఎస్ భూపాలపల్లి	31
ములుగు	29
మహబూబాబాద్	59
జనగామ	47

సాక్షిప్రతినిధి, వరంగల్: మద్యం ధరలకు మళ్లీ ‘సిండికేట్’ రెక్కలొచ్చాయి. ఇదివరకు రూ.100కు దొరికే క్వార్టర్ సీసా కోసం ఇప్పుడు రూ.110 ఇచ్చుకుంటున్నారు. హాఫ్‌బాటిల్ రూ.20 నుంచి రూ.30, ఫుల్ బాటిల్ రూ.40 నుంచి రూ.60 మేరకు అదనంగా విక్రయిస్తున్నారు. బ్లాక్‌డాగ్, హండ్రెడ్ పైపర్, టీచర్స్ వంటి స్కాచ్ బ్రాండ్లకు ఫుల్ బాటిల్‌కు రూ.50 దాకా పెరిగాయి. లైట్ బీరు రూ.20 చొప్పున.. స్ట్రాంగ్ బీరు రూ.10 అదనంగా అమ్ముతున్నారు. 2022, మే 19న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఐదారు నెలలపాటు అదే ధరలకు విక్రయించిన మద్యం వ్యాపారులు.. ఇటీవల పలుచోట్ల సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన కొందరు ‘లిక్కర్ సిండికేట్’లపై వరంగల్ డిప్యూటీ కమిషనర్, హైదరాబాద్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

యథా సిండికేట్.. తథా ఆబ్కారీ శాఖ
ఉమ్మడి జిల్లాలో అనుమతి పొందిన మద్యం పాపుల్లోనే ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు చేపట్టడం విస్మయానికి గురిచేస్తోంది. గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) ఏసీ బ్లాక్ విస్కీ క్వార్టర్ రూ.220, హాఫ్ బాటిల్ రూ.440 కాగా.. మెక్‌డ్వొల్ క్వార్టర్ రూ.190, హాఫ్ రూ.380, రాయల్ ఛాలెంజ్ బ్లెండెడ్ విస్కీ క్వార్టర్ రూ.220, హాఫ్ రూ.440 ఉండగా.. ఈ ధరలు కాదని అధికంగా వసూలు చేస్తున్నారు. రాయల్ స్టాగ్, పీటర్ స్కాట్, బ్లెండర్ స్ప్రైడ్ రకాలు తాగే మద్యం ప్రియులపై ‘సిండికేట్’ భారం పడుతోంది. అలాగే చల్లటి బీర్లకూ ధరల వేడి తాకుతోంది. బడ్‌వైజర్ 500 ఎంఎల్ రూ.160లు, కింగ్ ఫిషర్ లైట్ 650 ఎంఎల్ రూ.150, స్ట్రాంగ్ రూ.160, కేఎఫ్ ఆల్ట్రా రూ.220, రాయల్ ఛాలెంజ్ 650 ఎంఎల్. రూ.150 కాగా, ఒక్కో బీరుకు రూ.10ల నుంచి రూ.20లు అదనంగా తీసుకుంటున్నారు. చీప్‌లిక్కర్‌పై ధరలు ఇష్టారాజ్యంగా పెంచుతుండడంతో సామాన్య ప్రజలు, దినసరి కూలీలు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక గ్రామాల్లో నిర్వహించే బెల్ట్ షాపుల్లో ధర చెప్పనలవిగా లేకపోగా, ఆ బెల్ట్‌షాపులు సైతం ఈ ‘సిండికేట్’ల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి.

రంగంలోకి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్...
ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 294 మద్యం దుకాణాలు ఉన్నాయి. పరకాల, నర్సంపేట, తొర్రూరు, భూపాలపల్లి, చిట్యాల, ములుగు, ఏటూరు నాగారం డివిజన్లలో మద్యం వ్యాపారుల సిండికేట్‌పై ఎక్సైజ్ కమిషనర్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. కాజీపేట, వరంగల్, జనగామ ప్రాంతాల్లో కొన్నిచోట్ల అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ బృందం ఇటీవల దాడులు నిర్వహించింది. ఎమ్మార్పీకి భిన్నంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ జేఎస్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ వైన్స్‌ను ఇటీవల సీజ్ చేశారు. చిట్యాల, రేగొండలలో తనిఖీలు నిర్వహించారు.
కాజీపేటలోని రెండు వైన్స్‌లపై దాడులు చేసిన అధికారులు నిర్వాహకులను హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది. వరంగలోని రెండు షాపులపై దాడులు నిర్వహించి మద్యం శాంపిల్స్ సేకరించినట్లు సమాచారం. ఎమ్మార్పీ ఉల్లంఘనపై మొక్కుబడిగా కాకుండా సీరియస్‌గా దాడులు నిర్వహించి, సిండికేట్ ఆటకట్టించాలని బాధితులు కోరుతున్నారు.

వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో ప్రజలనుంచి వివిధ రకాల సమస్యలపై స్వీకరించిన వినతులు త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో తహసీల్దార్ హనుమకొండ-9, తహసీల్దార్ కాజీపేట-7, తహసీల్దార్ ఎల్కతుర్తి-6, ఆర్‌డీఓ-6లతోపాటు మొత్తం 82 దరఖాస్తులు స్వీ కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వాసుచంద్ర, వివిధ విభాగాల అధికారులు శ్రీనివాస్, సాంబశివరావు, జగదీశ్వర్, శ్రీనివాస్, హరిప్రసాద్, మాధవీలత, డీటీడీఓ ప్రేమకళారెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వరంగల్ ప్రజావాణిలో 45 అభ్యర్థనలు
వరంగల్ రూరల్: వరంగల్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్‌జీ అభ్యర్థనలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 45 దరఖాస్తులు వచ్చాయి.

ఇంటిస్థలం కబ్జా చేశారు...



నా పేరు కమల, భర్త ఆటోడ్రైవర్. మేము దర్గాలో ఉంటాం. మాకు ప్రభుత్వం కాజీపేట మండలం న్యూశాయంపేట జాగీర్‌లోని సర్వేనంబర్ 299లో 2010లో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు, ఇంటిస్థలం కేటాయించారు. కొంతవరకు నిర్మాణం పనులు చేసుకున్నాం. హౌసింగ్ బోర్డు నుంచి బిల్లుకూడా వచ్చింది. ప్రస్తుతం అక్కడ కొందరు అడ్డంగా కందకం తవ్వి స్థలం మాదే అంటున్నారు. మమ్మల్ని రానివ్వడంలేదు. అధికారులు స్పందించి మా ఇల్లు, స్థలం మాకు వచ్చేలా చూడాలి.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- 23న మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకోవాలి
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



ధర్నాలో పాల్గొన్న నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాజీపేట రూరల్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ కేసుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట బాపూజీనగర్ చౌరస్తా కడిపికొండ బ్రిడ్జి వద్ద సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రం లీక్ ఘటనపై జరిగిన నిరసన ధర్నాలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో పారదర్శకంగా పరీక్షలు జరుగుతాయనే నమ్మకం ఉండేదని, కానీ లీక్ ఘటనతో నిరుద్యోగుల్లో నమ్మకం పోయిందన్నారు. పేపర్ లీక్ కేసులో పెద్ద తలకాయలను కాపాడేందుకు చిన్న చేపలను బలి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 23వ తేదీన హనుమకొండలో జరిగే మంత్రి కేటీఆర్ పర్యటనను నిరుద్యోగులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజాస్వామ్యబద్ధంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కాజీపేట పోలీసులు కలగజేసుకుని అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు షేక్‌అజ్గర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అంకూస్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు మేకల ఉపేందర్, ఎంవి.రాజు, ఇప్ప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వీర్యానికి కార్యాచరణ

- జూలై నెలాఖరుకల్లా 2లక్షల మెట్రిక్ టన్నులను నిర్వీర్యం చేయాలి
- రాంపూర్‌లోని బయో మైనింగ్ పనులను పరిశీలించిన మేయర్, కలెక్టర్



బయో మైనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, ఇన్‌చార్జ్ కమిషనర్, వరంగల్ కలెక్టర్

వరంగల్ అర్బన్/మడికొండ: జూలై నెలాఖరునాటికి రెండు లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను నిర్వీర్యం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి, ఇన్‌చార్జ్ కమిషనర్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం బల్దియా పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్ డంపింగ్ యార్డులో చేపట్టిన బయో మైనింగ్ ప్రక్రియ పనితీరును మేయర్, కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. బయో మైనింగ్ ద్వారా చెత్త నిర్వీర్యం చేస్తున్న రికార్డులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. డంపింగ్ యార్డులో 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా.. ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నులను బయో మైనింగ్ ద్వారా నిర్వీర్యం చేశారన్నారు. మిగిలిన వ్యర్థాలను సకాలంలో నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్వీర్యంతో వెలువడిన అంత్య ఉత్పన్నాలు, ఆర్‌డీఎఫ్‌లను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించడంతోపాటు రైతులు పొలాల్లో ఉపయోగించుకునే విధంగా వ్యవసాయ శాఖ ద్వారా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తనిఖీల్లో కార్పొరేటర్ సరోజన, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ సంజయ్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్, ఏఈ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్లు బాలాజీ, బి.వినోద్, కరుణాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

రైల్వే లోకో పైలెట్లా.. రోబోలా?
పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలి
24న విద్యుత్ సౌధ ఎదుట ధర్నా - 10లో▸

ఎర్త్ అవర్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర ప్రతినిధులు

హన్మకొండ అర్బన్/వరంగల్ రూరల్: మార్చి 25న ప్రతి ఒక్కరూ రాత్రి 8.30 నుంచి 9.30 వరకు కలిసికట్టుగా విద్యుత్ నిలిపివేయడంపై రూపొందించిన ఎర్త్ అవర్ పోస్టర్‌ను హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లలో ఆయా జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలు సోమవారం ఆవిష్కరించారు. గృహాలు, వ్యాపార కేంద్రాలు, ఇతర కార్యాలయాల్లో గంటపాటు విద్యుత్ కాంతులను ఆపివేసి ప్రకృతిని కాపాడి, పర్యావరణానికి మేలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రపంచ పర్యావరణ నిధి ప్రాజెక్టు ఆఫీసర్ హర్షశంకర్, మారి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు మండల పరశురాములు, రాజ్ డేవిడ్, ఇన్నారెడ్డి, ప్రజ్వల్ సీఈఓ రామ్మూర్తి, అక్రల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వినతులకు స్పందించరా..

- అధికారులను ప్రశ్నించిన అర్జీదారులు
- బల్దియా గ్రీవెన్స్‌కు వెల్లువలా వినతులు



బల్దియా గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్: తమ సమస్యలపై గ్రీవెన్స్‌లో పదే పదే ఫిర్యాదులు చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని పలువురు గ్రీవెన్స్ సెల్ వింగ్ అధికారులను నిలదీశారు. సమస్యలను పట్టించుకోకపోతే దరఖాస్తులు తీసుకోవడం ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో వింగ్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 83 ఫిర్యాదులు రాగా.. వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి 10, టౌన్ ప్లానింగ్‌కు(వ్యక్తిగత సమస్యలే అధికంగా..) 32, పన్నుల విభాగానికి 8, ప్రజారోగ్యానికి 6, తాగునీటి సమస్యలపై 7తోపాటు మరికొన్ని ఫిర్యాదులు నమోదయ్యాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సిహెచ్‌ఓ శ్రీనివాస్‌రావు, సిటీ ప్లానర్ వెంకన్న, ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..
- 10వ డివిజన్ పద్మాక్షి కాలనీ ఎస్ఆర్ బాయ్స్ రెసిడెన్షియల్ కాలేజీ సెల్లార్‌లో అక్రమ నిర్మాణం చేపట్టి కార్యాలయం నిర్వహిస్తున్నారని, దీనిని తొలగించాలని పలువురు వినతిపత్రం అందజేశారు.
- 54వ డివిజన్ హనుమాన్ నగర్ 5-11-717 అపార్టుమెంట్ నిర్మాణ హద్దులు దాటి ఫెన్సింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని తెలంగాణ కన్జ్యూమర్ కౌన్సిల్ ప్రతినిధులు కోరారు.
- హనుమకొండ వికాస్ నగర్‌లో 2-9-197/1 కొత్త భవన నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసి, రూ.76వేలు చెల్లించినా తిరస్కరించారని, తన సొమ్ము తిరిగి ఇప్పించాలని విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.
- 57వ డివిజన్ లష్కర్ సింగారం సర్వే నం.266లో 7.36 గుంటల స్థలంలో మార్కెట్‌ను నిర్మించాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక నాయకుడు తుపాకుల దశరథం కోరారు.
- దేశాయిపేట సర్వే నం.91/బీ/1లోని మా స్థలంలో వేరే వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి నిర్మాణం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- జీఎస్టీ సొమ్ము ఇప్పించాలని ఎంఎస్ఆర్ డెవలపర్స్ నిర్వాహకుడు విజ్ఞప్తి చేశారు.
- 46వ డివిజన్ అయోధ్యపురంలో 30-2-133 నల్లా కనెక్షన్ ఉన్నా తాగునీరు రావడం లేదని బుర్గుల రమేశ్ ఫిర్యాదు చేశాడు.
- ఖిలా వరంగల్‌లో 20-7-94 తన ఇంటిపై మరో వ్యక్తి బై నంబర్ తీసుకొని ఆక్రమించుకున్నాడని, చర్యలు తీసుకోవాలని జీవన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- దర్గా కాజీపేట 24-1-352/ఎ లో మా ఇంటి పక్కన పశువుల పాక ఉండటం వల్ల దుర్వాసన వస్తోందని, అక్కడి నుంచి దానిని తొలగించాలని రేణుక ఫిర్యాదు చేశారు.

● సారొచ్చేసరికి.. కారు చల్లగుండాలంట!

గ్రీవెన్స్ ముగిసేదాకా ఇంజన్ ఆన్‌లోనే..



కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎర్త్ డేకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించి ప్రకృతి పరిరక్షణ గురించి చెబుతున్న సందర్భం.. అదే సమయంలో కలెక్టరేట్ ఆవరణలో ఓ ప్రభుత్వ వాహనం మూడు గంటలుగా ఆన్‌లోనే ఉంచి.. డ్రైవర్ ఏసీ వేసుకుని ఉన్నాడు.. ఇదేమిటి.. ఇన్ని గంటలు కారును ఆన్‌లోనే ఉంచావు అని అడిగితే ‘మా సార్ బయటికి వచ్చేటప్పటికి కారును చల్లగా ఉంచాలి’ అని సమాధానం. ఇంతకు ఆ కారు ఎవరిదంటే.. బల్దియా ఎస్ఈ అధికారిక వాహనం. గ్రీవెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. కార్యక్రమం ముగిసి బయటికి వచ్చేంతవరకు కారును ఇలా ఆన్‌లోనే ఉంచడం గమనార్హం. ఇదేనేమో ఇంధన పొదుపు.. పర్యావరణ పరిరక్షణ అంటే.. !!

- హన్మకొండ అర్బన్

వరద నీరు ఆగొద్దు..

మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాల్లో వ్యర్థాల పూడికతీతను వేగవంతం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజనీర్లు, ప్రజారోగ్యం అధికారులతో మేయర్ సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో మహా నగరం వరద ముంపునకు గురికాకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. 33 ప్రధాన నాలాలు, యూటీలు, స్ట్రామ్ వాటర్ డ్రైయినేజీల పూడికతీతకు వెంటనే టెండర్లు నిర్వహించాలన్నారు. అంతర్గత నాలాల్లో వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికుల చేత గ్యాంగ్ వర్క్ చేపట్టాలని సీఎంహెచ్‌ఓకు సూచించారు. సమావేశంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈలు రాజయ్య, శ్రీనివాసరావు, డీఈలు రవికుమార్, రవికిరణ్, సంతోశ్‌బాబు, నరేందర్, సారంగం, ఏఈలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కదారి భోగేశ్వర్

విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులన్నీ ఈ నెలాఖరులోగా చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో వరంగల్ జిల్లాస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీ ఎరియర్స్, సరెండర్ లీవు బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ టీఎస్‌జీఎల్ఐ రుణాలు తదితర అనేక బిల్లులు ఈ కుబేర్‌లోనే పెండింగ్‌లో పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య ఖర్చులకు ఇచ్చే మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగ విరమణ పొందితే వచ్చే బెనిఫిట్స్ బిల్లులు కూడా జాప్యం అవుతున్నాయన్నారు. ఈ నెల 24న వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టబోతున్నామని, టీపీటీఎఫ్ బాధ్యులతోపాటు ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జె.స్వామి, జి.లక్ష్మీపతి, కార్యదర్శులు వి.రవీందర్, ఎండీ.తస్నీర్, ఉట్కూరు అశోక్, బాధ్యులు మునిపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే రామయ్య తలంబ్రాలు

హన్మకొండ: శ్రీరామ నవమి రోజు జరిగే భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేరవేయనున్నట్లు తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ బి.నంద ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖ భక్తుల కోసం ప్రత్యేకంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. స్పీడ్ పోస్టు ద్వారా 10 గ్రాముల తలంబ్రాలు, 2 ముత్యాలు, పసుపు, కుంకుమ, మిస్రీ, కాజు ప్రసాదం ఇంటికే పంపనున్నట్లు తెలిపారు. ఇందు కోసం భక్తులు సమీపంలోని పోస్టాఫీసులో ఈనెల 28వ తేదీలోపు రూ.450 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. 20 గ్రాముల తలంబ్రాలు, 2 ముత్యాలను రూ.150 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా సేవలు పొందవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


ముళ్లపొదల్లో కృష్ణ మృతదేహం

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బొజ్యన కృష్ణ(36) మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బీబీనగర్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య రాధిక స్వగ్రామం మడికొండకు ఇటీవల తమ సమీప బంధువులు మృతి చెందగా వచ్చాడు. ఆదివారం రంగశాయిపేటలోని బంధువులను కలిసేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి మడికొండకు వస్తున్న క్రమంలో అమ్మవారిపేటకు రాగానే బైక్ అదుపు తప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఆర్‌ఎంపీ?

ఖిలా వరంగల్: కరీమాబాద్ ప్రాంతంలో ఆర్‌ఎంపీగా చలామణి అవుతున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వైద్యపరమైన సర్టిఫికెట్లు లేకుండానే వైద్య సేవలందిస్తూ.. థైరాయిడ్‌కు నాటు మందు ఇస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆయనను పట్టుకున్న మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం

ఆత్మహత్య

గీసుకొండ: తండ్రి తరచుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవపడుతూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన బర్ల శ్రీనివాస్, స్వరూప దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు వివాహం జరిగింది. కుమారుడు శ్రీకాంత్(27) డిగ్రీ వరకు చదువుకుని ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తండ్రి కూలీ పనికి వెళ్లి తరచుగా తాగి వచ్చి తన తల్లి స్వరూపను తిడుతూ.. కొడుదూ ఉండేవాడు. ఆదివారం రాత్రి కూడా తండ్రి తాగివచ్చి తన తల్లితో గొడవ పడటంతో శ్రీకాంత్ ఆమెను ధర్మారంలోని బంధువుల ఇంటికి పంపించాడు. తిరిగి ఇంటికి వెళ్లి గదిలో ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం తల్లి వచ్చి చూడగా అప్పటికే దూలానికి వేలాడుతూ మృతి చెంది ఉన్నాడని మృతుడి బంధువులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు టోకరా..

- నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా
- పోలీసులకు చిక్కిన ముఠా
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం
- విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన అధికారులు

వరంగల్ క్రైం : నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా, బిల్లులు ఎలాంటి తేడాలు కనిపించకుండా నకిలీలు సృష్టించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఏదుల కిరణ్, ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గంట ప్రదీప్‌రెడ్డి, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంచెళ్ల వెంకటేశ్, ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన పర్లపల్లి శ్రీకాంత్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం సాయిగోని బావికి చెందిన బండమిద్ది స్వామి, అరుట్ల రాజు, రంగారెడ్డి జిల్లా మంచెల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద శివ, నల్గొండ జిల్లా దిండ్ మండలం గౌరారం గ్రామానికి చెందిన జోగు సైదులులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన చరణ్‌గౌడ్, ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘన్‌పూర్‌కు చెందిన యనమళ్ల రాకేష్, ఆత్మకూరు మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం వావిలాళ్లపల్లికి చెందిన బచనగోని యాదగిరిలు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి 65 నకిలీ వే బిల్లులు, టీఎస్‌ఎండీసీ 16 స్టాంపులు, 16 లారీలు, 11 సెల్‌ఫోన్‌లు, 1 ట్యాప్‌లాప్, రూ.41వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా నిందితుల కంప్యూటర్ ద్వారా ఈ ముఠా ఇప్పటికి సుమారు 1,700 వే బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యుల్లో లారీ ఓనర్ల పై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక లోడింగ్ కోసం 12 టైర్ల లారీ ఓనర్లు రూ.10,238, 14 టైర్ల ఓనర్లు రూ.13,085 , 16 టైర్ల ఓనర్లు రూ.14,800 చెల్లించి డీడీలను టీఎస్‌ఎండీసీకి చెల్లించి ఇసుక లోడింగ్ చేసుకుంటారని, అలా కాకుండా కంప్యూటర్ పై అవగాహన ఉన్న ఏదుల కిరణ్‌కుమార్ నకిలీ వే బిల్లులను క్యూఆర్ కోడ్‌తో సహా సృష్టించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసారని సీపీ తెలిపారు. కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లారీ ఓనర్లతో నేరుగా సంబంధాలను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా ఈ ముఠా రాష్ట్రంలోని 37 ఇసుక రీచ్‌లలో దందా కొనసాగిస్తున్నదని సీపీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వే బిల్లుల దందా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని వారం పదిరోజుల్లో ఈ ముఠాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లులను సీపీ అభినందించారు.

‘మన బడి’ పనులు వేగవంతం చేయాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ రూరల్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మన ఊరు–మన బడి పనులపై అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఈఓ డి.వాసంతి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంఈఓలు ప్రతీ పాఠశాలను సందర్శించి పనుల పురోగతి వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థలంలో స్థానిక సర్పంచ్, ఏఈ, హెచ్‌ఎంలు సృజనాత్మకంగా ఆలోచించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈనెల 31వ తేదీలోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఠాణునాయక్ స్ఫూర్తితో పోరాడాలి


ఠాణునాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు ఠాణునాయక్ ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాడాలని లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జాటోత్ కిషన్ నాయక్ సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఠాణునాయక్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాణునాయక్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కిషన్ నాయక్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం నైజాం సేనలు, దేశ్‌ముఖ్ గుండాలతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన గిరిజన బిడ్డ జాటోత్ ఠాణునాయక్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ, అంబేడ్కర్ సంఘం సమన్వయకర్త జన్ను భాస్కర్, బీఎస్పీ నాయకుడు బొట్ల కార్తీక్, ఎల్‌హెచ్‌పీఎస్ అధికార ప్రతినిధి పోరిక ఉదయ్‌సింగ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు సునీల్ నాయక్, భూక్య శ్రావణ్ నాయక్, గుగులోతు రమేష్ నాయక్, లావుడ్య శ్రీను నాయక్, మాలోత్ రాము నాయక్ పాల్గొన్నారు.

శ్రుతిమించిన బైక్ విన్యాసాలు

- ముగ్గురు యువకుల అరెస్ట్


యువకుల అరెస్టు చూపుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ

వరంగల్ క్రైం: బైక్‌లపై శ్రుతిమించిన విన్యాసాలు చేస్తూ.. అజాగ్రత్తగా నడుపుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగించిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ సోమవారం తెలిపారు. అతివేగంగా.. అజాగ్రత్తగా బైక్ నడిపి ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించిన గోదావరిఖనికి చెందిన శ్రీరామోజుల ఆకాశ్, మూదం అజయ్, తౌటం నివాస్‌ను రెండు రోజుల క్రితం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరు హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటూ.. శనివారం కాజీపేటకు చెందిన వారి స్నేహితుడు మోతె వంశీకి చెందిన కేటీఎం బైక్‌ను తీసుకొని దానిపై విన్యాసాలు చేసిన వీడియో వైరల్‌గా మారిందని, దీంతో వారిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా ప్రవర్తించే వారిని వదిలిపెట్టేది లేదన్నారు. యువకుల లైసెన్స్‌లను రద్దు చేయాలని డీటీసీకి సిఫారసు చేయడంతోపాటు కళాశాల యాజమాన్యం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై అక్రం, కానిస్టేబుళ్లు శివ, రాజు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ శేషు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేషు మాట్లాడారు. వ్యక్తులు చేసిన తప్పులు వ్యవస్థకు అపాదించడం సరైంది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తులు వ్యవస్థల భాగమేనని గుర్తించాలన్నారు. టీఎస్పీఎస్సీలో జరిగిన తప్పిదాల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోను అప్రతిష్ట మూటగట్టుకున్న ఏపీపీఎస్సీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఏర్పాటైన టీఎస్పీఎస్సీ కూడా అదే దారితో నడుస్తుందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రాల లీక్, ప్రశ్నాపత్రాల్లో తప్పులు, భర్తీ ప్రక్రియలో జాప్యం వంటి అనేక తప్పిదాలతో టీఎస్పీఎస్సీ నిరుద్యోగుల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీని సమూలంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్, మెయిల్ ద్వారా ప్రక్షాళనకు చెందిన సూచనలను ఇప్పటికే పంపామని, లేఖ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా వేదిక నాయకులు సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, అజయ్, నరేందర్, దానేశ్వర్, జితేందర్, కిరణ్, బోస్ పాల్గొన్నారు.

తెలంగాణకు రెండో బహుమతి


బహుమతితో జీవిత

వరంగల్(పర్వతగిరి): జైపూర్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన స్క్వాష్ రాకెట్ పోటీలకు గాను తెలంగాణకు రెండో బహుమతి లభించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన జీవిత పోటీల్లో నైపుణ్యం సాధించి రెండో బహుమతికి దోహదపడింది. దేశవ్యాప్తంగా పది టీంలు పాల్గొనగా మొదటి బహుమతి మహారాష్ట్ర దక్కించుకోగా, రెండో బహుమతి తెలంగాణ కైవసం చేసుకుంది. గతంలో అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయిలో.. ప్రస్తుతం స్క్వాష్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: మావోయిస్టులకు సహకరిస్తేశాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్పీ గాష్ ఆలం హెచ్చరించారు. ఈ మేరకు అనుమానితంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఎనిమిది మంది నిషేధిత సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని పోలీసు సాయుధ కార్యాలయంలో ఎస్పీ గాష్ ఆలం విలేకరుల సమావేశంలో అరెస్ట్ చూపించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వెంకటాపురం (కె) మండలం రామచంద్రాపురం శివారులో కొంత మంది కారు, ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని వెంబడించారు. కారు, ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పేలుడు పదార్థాలు, ఐఈడీ మెటీరియల్‌లోని తోహభాగాలు, విప్లవ, సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మావోయిస్టు అగ్రనేత దామోదర్, చంద్రన్నతో కలిసి , మరికొంత మంది సభ్యులు భూ సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. దామోదర్ సూచనల మేరకు కూంబింగ్ ఆపరేషన్ల కోసం అడవికి వచ్చే పోలీసులను చంపాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను తరలిస్తూ కనిపించారు. పట్టుబడిన వారిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన అందె రవి, వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన శ్రీరామోజు మనోజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దిడ్డి సత్యం, సంగెం మండలానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి, మల్హర్ మండలం పెద్దతండా గ్రామానికి చెందిన అనసూరి రాంబాబు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలానికి చెందిన గణపురం చంద్రమౌళి, కాప్రా మండలానికి చెందిన పృథ్వీరాజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారానికి చెందిన అందె మానసగా తెలిసింది. నిందితులు అందరిపై కేసులు ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఐఈడీఎస్–45 యొక్క ఇనుప భాగాలు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు డిటోనేటర్లు, ఒక బ్యాటరీ, నాలుగు విప్లవ సాహిత్యాలు, మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు సంభందించిన మాత్రలు, కారు బేరింగ్, హోండా మోటార్ ద్విచక్రవాహన బేరింగ్, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 4140 నగదు పట్టుబడినట్లు తెలిపారు. సంఘటన ఆధారంగా వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని అన్నారు. సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆబ్కారీ చేతివాటం

- పట్టుకున్న నల్లబెల్లం అమ్మకానికి తరలింపు
- గుట్టు రట్టు చేసిన మరిపెడ పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్


పట్టుబడిన తొర్రూరు ఎక్సైజ్ బెల్లం వాహనం

మరిపెడ రూరల్: అక్రమ వ్యాపారాలు ఆట కట్టించే ఆబ్కారీ పోలీసులు చేతివాటం ప్రదర్శించారు. ఓ వేలం వేసిన వాహనంలో అక్రమంగా నల్ల బెల్లం తరలించి అమ్మడానికి డంపుచేస్తుండగా మరిపెడ పోలీసులు పట్టుకుని గుట్టురట్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న పలు వాహనాలను అబ్కారి ఆధ్వర్యంలో ఇటీవల వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలం పాటలో వాహనాలు దక్కించుకున్నారు. ఈ ఇదే అదునుగా భావించిన ఎక్సైజ్ అధికారులు చేతి వాటం ప్రదర్శించారు. అనుకూలంగా ఉన్న ఓ బెల్లం బస్తాల లోడ్ వాహనాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించారు. మరిపెడ మండలంలోని యలమంచిలితండాలో శివారులో డంప్ చేస్తున్నారు. తండా వాసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు వాహనాన్ని పట్టుకొని మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో డ్రైవర్ విచారించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వెంటనే మేల్కొన్న అబ్కారీ అధికారి తమ ఆధీనం నుంచే బెల్లం లోడ్ వాహనం అటు వైపుగా వచ్చిందని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి వాహనాన్ని తొర్రూరు తీసుకెళ్లారు. కంచె చేను మేసిన చందంగా తొర్రూరు ఎక్సైజ్ పోలీసుల తీరు ఉందని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ వ్యవహారమంతా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం గమనార్హం. ఈ విషయంపై తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. వేలం వేసిన వాహనం విజయవాడకు వెలుతుంది. తమ తప్పిదం వల్ల బెల్లం బస్తాలు అందులోనే ఉండిపోవడంతో మరిపెడ పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చినట్లు సదరు అధికారి పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మాయ

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి రూ.30వేలు నష్టపోయింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన యువతి ఓఎల్‌ఎక్స్ అప్లికేషన్స్ పరిశీలిస్తుండగా అందులో ఒక పల్సర్ బైక్ అమ్మకానికి ఉండగా కింద ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బేరం కుదుర్చుకుంది. జీఎస్టీ, ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీల కింద మోసగాళ్లు చెప్పినట్లుగా డబ్బులను చెల్లించింది. ఆ తర్వాత అటువైపు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : ఎండు గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, సరఫరాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా వరంగల్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపాటి సుమంత్, పాకాల సాయికుమార్, ములుగు వికాస్ అలియాస్ విక్కీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.60 వేల విలువగల మూడు కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు శివనగర్‌కు చెందిన కమ్మంపాటి సుమంత్ కరీంనగర్‌లో కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడేవాడని తెలిపారు. సుమంత్ స్నేహితులైన పాకాల సాయికుమార్, ములుగు వికాస్‌లు ఎవరికి అనుమానం రాకుండా వరంగల్, మహబూబాబాద్ మీదుగా భద్రాచలం నుంచి ఒడిషాలోని కలిమెలకు ద్విచక్ర వాహనం పై చేరుకొని అక్కడ మొద్దు అలియాస్ భాయ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వరంగల్‌కు చేరుకొని 100 గ్రాముల గంజాయిని రూ.500, రూ.700, రూ.1000 చొప్పున అమ్మే వారని తెలిపారు. వరంగల్‌లోని శివనగర్, కాశిబుగ్గ, కరీమాబాద్, ఖిలా వరంగల్, చింతల్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. కొంతమంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. 15 మంది గంజాయి విక్రయదారులు, 50 మంది వినియోగదారులను ఆదివారం రాత్రి ఖిలా వరంగల్‌లోని రాతికొండ దగ్గరకు వస్తున్నారనే సమాచారంతో వెళ్లగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 13 మంది గంజాయి అమ్మకందారులను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి సేవించే వారిని 159 మందిని గుర్తించి కమిషనరేట్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14 మందిని జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, కానిస్టేబుళ్లు రాజేష్, రాజు, బిక్షపతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్‌లను సీపీ నగదు రివార్డులతో అభినందించారు.

నల్లబెల్లం స్వాధీనం.. కేసు నమోదు


మరిపెడలో పట్టుబడిన బెల్లం లోడ్ నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మరిపెడ రూరల్: అక్రమంగా రవాణ చేస్తున్న 21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధు సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి నుంచి వయా విస్సంపల్లి, ఎల్లంపేట మీదుగా సోమ్లతండాకు ఓ వాహనంలో బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల్లోని 21 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమ్లతండాకు చెందిన గుగులోతు నవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన పుల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రావణ్, మధార్ పాల్గొన్నారు.